క్లుప్తంగా

స్కూల్‌కి క్రీడాదుస్తుల బహూకరణ



క్రీడాదుస్తులు అందిస్తున్న సత్యనారాయణమూర్తి

మామిడికుదురు: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలకు రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ జాయింట్ సెక్రటరీ వాసంశెట్టి సత్యనారాయణమూర్తి సోమవారం క్రీడాదుస్తులను బహూకరించారు. 50 జతలను స్కూల్ ప్రధానోపాధ్యాయిని సీహెచ్ నిరంజనికి అందజేశారు. ఆయన మాట్లాడుతూ తాను చదువుకున్న స్కూల్‌కు తన వంతు సహాయంగా క్రీడాదుస్తులు అందించానని సత్యనారాయణమూర్తి పేర్కొన్నారు. దాత సత్యనారాయణమూర్తిని హెచ్ఎం నిరంజని, పీడీ మట్టా శ్రీధర్, స్కూల్ ఉపాధ్యాయులు అభినందించారు.

గ్రామాలను సస్యశ్యామలం చేస్తాం



గూడపల్లిలో తాగునీటి కుళాయి ప్రారంభించిన ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

మలికిపురం: గ్రామాలను సస్యశ్యామలం చేస్తామని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పేర్కొన్నారు. మలికిపురం మండలం అడవిపాలెం వీరభద్ర స్వామి గుడి వద్ద సోమవారం రూ.12 లక్షలతో అసంపూర్తిగా ఉన్న పద్మశాలీల వీవర్స్ కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు పునః ప్రారంభం చేశారు. అలాగే పంచాయతీ నిధులతో నిర్మించనున్న నూతన రోడ్ పనులకు కొబ్బరికాయ కొట్టారు. గూడపల్లి కాలనీలో రూ.31.70 లక్షల జల్‌జీవన్ మిషన్ నిధులతో నిర్మించిన 40 వేల లీటర్ల వాటర్ ట్యాంక్, నూతనంగా నిర్మించిన సిమెంట్ రోడ్‌ను ఆయన ప్రారంభించారు. మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెదకాపు, ఎంపీపీ మేడిచర్ల వెంకట సత్యవాణి, సర్పంచ్‌లు సుందర తాతాజీ, అనంతలక్ష్మి, గంటా నాయుడు, సుందర బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పశు ఆరోగ్య శిబిరాలు

ఆలమూరు: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు స్థానిక పశుసంవర్థక శాఖ ఏడీఏ కార్యాలయం పరిధిలో మంగళవారం నుంచి పశు వైద్య శిబిరాలను ఏర్పాటు చేయనున్నట్లు ఏడీఏ ఎల్.అనిత అన్నారు. స్థానిక ఏడీఏ కార్యాలయంలో సోమవారం ఆమె మాట్లాడుతూ ఆలమూరు, కపిలేశ్వరపురం మండలాల్లోని ప్రతి గ్రామంలో పశువుల ఆరోగ్యాభివృద్ధి లక్ష్యంగా పశు శిబిరాలను సమర్థవంతంగా నిర్వహించనున్నామన్నారు. ఈ పశువైద్య శిబిరాల్లో ఆవులు, గేదెలతో పాటు గొర్రెలు, మేకలు, దూడలకు నట్టల నివారణ మందులను అందజేయనున్నామన్నారు. అలాగే పశువులకు కృత్రిమ గర్భధారణ, చూడి పరీక్షలను నిర్వహించనున్నారు. పశుపోషకులు, పాడిరైతులందరూ ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఏడీఏ కోరారు.

నేడు సర్వసభ్య సమావేశం

ఆలమూరు: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం సర్వసభ్య సమావేశం జరగనున్నట్లు ఎంపీడీఓ ఎ.రాజు అన్నారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ మండల సర్వసభ్య సమావేశానికి ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు అధ్యక్షతన ఎమ్మెల్యే బండారు సత్యానందరావు హాజరవుతారని తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులందరూ హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ విజ్ఞప్తి చేశారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం

రాజోలు: రక్షిత తాగునీటి సమస్యకు పూర్తి స్థాయిలో పరిష్కారం చేస్తున్నామని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. సోమవారం పొన్నమండ గ్రామంలోని కందికట్టు వారి గ్రూపులో రూ.33.21 లక్షలు ఓఎన్జీసీ(సీఎస్ఆర్) నిధులతో నిర్మాణం చేసిన 90 వేల లీటర్ల సామర్థ్యం గల తాగునీటి వాటర్ ట్యాంక్, కుళాయిలను ఎమ్మెల్యే వరప్రసాద్ ప్రారంభించారు. ఓఎన్జీసీ అసెట్ మేనేజర్ శంతనుదాస్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఓఎన్జీసీ కార్యక్రమాలు నిర్వహిస్తున్న గ్రామాల్లో సామాజిక బాధ్యతగా పలు అభివృద్ధి పనులకు నిధులు కేటాయిస్తున్నామన్నారు. డెల్టా చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెదకాపు, ఎంపీపీ కేతా శ్రీనివాస్, జెడ్పీటీసీ మట్టా శైలజ, సర్పంచ్ కుక్కల బేబికుమారి పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు

అయినవిల్లి: మండలంలోని తొత్తరమూడి గ్రామానికి చెందిన మతిస్థిమితం లేని ఓ వ్యక్తి అదృశ్యంపై సోమవారం కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ ఆర్.శ్రీనివాస్ తెలిపారు. దీనికి సంబంధించిన హెడ్‌కానిస్టేబుల్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అయినవిల్లి మండలం తొత్తరమూడి గ్రామానికి చెందిన దంగేటి ఏసుబాబు (54)కు పెళ్లి కాలేదు. అతడికి మతి స్థిమితం లేదు. ఈ నెల 17న ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. మరలా తిరిగిలేదు. దీనిపై అతని బంధువు సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ తెలిపారు.

బెంగాలీ కూలీల హవా

- ఖరీఫ్, రబీలోనూ వారి వైపే మొగ్గు
- స్థానిక కూలీలకు తగ్గిన ఆదరణ
- సమయం, పెట్టుబడి ఆదా అంటున్న అన్నదాతలు



సిరిపల్లిలో వరి నాట్లు వేస్తున్న బెంగాలీ కూలీలు

అయినవిల్లి: వ్యవసాయమే జీవనోపాధిగా ఎంచుకున్న రైతుకు జీవితం ముందుకు సాగాలంటే రైతుకు చేసే సాగు లాభసాటిగా సాగాల్సిందే. వ్యవసాయాధారిత నియోజకవర్గంలో రైతన్నకు కొబ్బరి, వరి పంటే ప్రధాన ఆధారం. అయితే ప్రధానంగా వరి సాగులో పెరుగుతున్న ఖర్చులకు అన్నదాతలు భయపడుతున్నారు. ప్రకృతి వైపరీత్యాల కారణంగా పండించిన పంట ఇంటికి చేరే వరకూ రైతులు ఆపసోపాలు తప్పడం లేదు. మరోవైపు వ్యవసాయ పనులు ప్రారంభమయ్యే సమయంలో స్థానికంగా కూలీల కొరత ఏర్పడి కూలి రేట్లు ఒక్కసారిగా పెరిగిపోతున్నాయి. దీనిపై ఖర్చులను తగ్గించుకోవడానికి రైతులు ప్రయత్నిస్తున్నారు. స్థానిక కూలీలైతే రోజులో 5 గంటలు మాత్రమే శ్రమించి నాట్లు వేస్తున్నారు. వీరికి ఖర్చు సైతం అదనంగా అవుతుంది. ఈ నేపథ్యంలో బెంగాల్ నుంచి వస్తున్న వలస కూలీలతో పనులు చేయించుకోవడానికి అన్నదాతలు ప్రాధాన్యమిస్తున్నారు. పైగా బెంగాలీలైతే సమయం, ఖర్చు రెండూ ఆదా అవుతున్నాయని రైతులు చెబుతున్నారు. పి.గన్నవరం నియోజకవర్గంలోని అయినవిల్లి, అంబాజీపేట, మామిడికుదురు, పి.గన్నవరం మండలాల్లో సుమారుగా 20,330 ఎకరాల్లో రైతులు వరి సాగు చేపట్టగా ఇప్పటి వరకు 6060 ఎకరాల్లో నాట్లు మాత్రమే పూర్తయ్యాయి.

వ్యవసాయమంటేనే హడల్..

ఏటేటా ఎరువులు, పురుగుమందుల ధరలు విపరీతంగా పెరిగి రైతు వరి సాగు చేయాలంటే భయపడే పరిస్థితి కనిపిస్తుంది. రైతులకు గతంలో ఎకరానికి రూ.15 వేల నుంచి రూ.18 వేలు పెట్టుబడి అయ్యేది. కానీ ఇప్పుడు ఎరువులు, పురుగు మందులు, కూలీ రేట్లు పెరగడం వల్ల రూ.25 వేల నుంచి రూ.27 వేల వరకూ పెట్టుబడి ఖర్చవుతుంది. వీటికి తోడు కొన్ని ప్రాంతాల్లో కాలువల్లో పెరిగిన పూడిక, ఆక్రమణలు, గుర్రపుడెక్క వల్ల సాగునీరు సరిగా సరఫరా కాక ఇంజిన్లతో తోడుకోవడంతో రైతు అధిక ఖర్చుల బారిన పడుతున్నాడు. మరోవైపు సరిగ్గా వ్యవసాయ పనుల సమయంలో అధిక వ్యయం వెచ్చించినా సమయానికి కూలీలు దొరకడం లేదు. దీంతో గత కొన్నేళ్లుగా అయినవిల్లి, అంబాజీపేట, పి.గన్నవరం, మామిడికుదురు మండలాల రైతులు బెంగాలీకూలీల వైపు మొగ్గు చూపిస్తున్నారు. పశ్చిమబెంగాల్ నుంచి వస్తున్న వలస కూలీల పనిలో వేగం, నాట్లు వేయడంలో విభిన్న పద్ధతి వల్ల ఖర్చు సగానికి సగం తగ్గిపోతుండడంతో రైతులు వారికే అధిక ప్రాధాన్యమిస్తున్నారు.

స్థానికులకు, బెంగాలీలకు పనిలో తేడా ఇదే...

- స్థానిక కూలీలు ఎకరానికి 13 నుంచి 15 మంది అవసరమవుతారు, అదే బెంగాలీలైతే 10 మందితో పని పూర్తి చేసేస్తున్నారు.
- మన కూలీలకు ఎకరానికి రూ.8 వేల నుంచి 9 వేలు ఖర్చవుతుంది. అదే వలస బెంగాలీలైతే రూ.4300కే పని పూర్తవుతుంది.
- స్థానిక కూలీలు ఉదయం ఎనిమిది నుంచి పని మొదలుపెడతారు. అదే వారు ఉదయం 5 గంటలకే పనిలో నిమగ్నమవుతున్నారు.
- మన కూలీలు ఎకరా నాట్లకు 40 పోగుల నారు అవసరమైతే వారికి 15 నుంచి 20 పోగుల నారుతోనే ఊడ్పు అయిపోతుంది.
- స్థానిక కూలీల ఊడ్పునకు ఎక్కువ నారు అవసరం. దాంతో పాటు పంటకు తెగుళ్లను తట్టుకునే సామర్థ్యం, దుబ్బు చేసే తీరు తక్కువ. అదే బెంగాలీల నాట్ల శైలి వల్ల నారు తక్కువ, దుబ్బు చేయడం ఎక్కువ పైగా పంటకు తెగుళ్లను తట్టుకునే శక్తి, కలుపు పెరిగే తీరు అంతంతమాత్రమే.

సమయం, ఖర్చు రెండూ ఆదా



స్థానిక కూలీలకు ఉపాధి కల్పించాలని మాకు అనిపిస్తున్నా ప్రస్తుతం ఉన్న ఖర్చుల రీత్యా స్థానిక కూలీలతో పనులు చేయించ లేకపోతున్నాం. మేము గత ఆరేళ్లుగా బెంగాలీ వలస కూలీలతోనే నాట్లు వేయిస్తున్నాం. దీని వల్ల మాకు సమయం, ఖర్చు రెండూ ఆదా అవుతున్నాయి. వలస కూలీలు వేసిన నాట్లు దూరం దూరంగా నాటడంతో బాగా దుబ్బు చేసి ఎకరానికి ఐదారు బస్తాల దిగుబడి పెరుగుతుంది.

– మోత నాగేశ్వరరావు , రైతు, వెలువలపల్లి

ఉపాధి కోల్పోతున్నాం



తక్కువ రేటుకే బెంగాలీలు పనులు చేస్తున్నారు. దీంతో స్థానికంగా ఉన్న కూలీలకు ఉపాధి లేకుండా పోతుంది. వరి పనులకు మహిళలకు రూ.300, మగవారికి రూ.600 ఇస్తున్నారు. ప్రస్తుతం పెరిగిన ధరల రీత్యా ఈ కూలీ గిట్టుబాటు కావడం లేదు. రైతులు బెంగాలీ కూలీలపై ఆధారపడుతున్నారు. దీంతో స్థానిక కూలీలు తీవ్రంగా నష్టపోతున్నారు.

–బొక్కా రాజేశ్వరి, ముంగండ, అంబాజీపేట మండలం

కూటమి అభ్యర్థికి పోటీ చేసే హక్కు లేదు

అంబాజీపేట: ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీచేయబోయే కూటమి అభ్యర్థికి ఎన్నికల్లో పోటీ చేసే హక్కు లేదని అమలాపురం మాజీ ఎంపీ హర్షకుమార్ తనయుడు, ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి జీవీ సుందర్ ఆరోపించారు. అంబాజీపేటలో సుందర్ సోమవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే జాబ్ క్యాలండర్ ప్రకటిస్తామని, నిరుద్యోగ భృతి ఇస్తామని పేర్కొనప్పటికీ నేటి వరకు కార్యరూపం దాల్చలేదన్నారు. ఈ విషయమై నిరుద్యోగుల తరఫున తన వాణిని బహిరంగంగా వినిపిస్తానన్నారు. ఉద్యోగాల కల్పన లేదు గాని పరోక్షంగా లోకేష్‌కు ఉప ముఖ్యమంత్రి పదవి కోసం కూటమి నాయకులు వెంపర్లాడుతున్నారన్నారు. సమావేశంలో నూకపెయ్యి చిన్న, మాతా సత్యనారాయణ, కొల్లపు ప్రసాద్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా: ఇరువురికి గాయాలు

రాజోలు: కడలి కపోతేశ్వరస్వామి ఆలయం వద్ద సోమవారం వాటర్ టిన్నులు సరఫరా చేసే ఆటో బోల్తా పడింది. ఆటో వేగంగా నడపడంతో అదుపుతప్పి తిరగబడిందని స్థానికులు తెలిపారు. ప్రమాదం జరిగిన సమయంలో ఎదురుగా ఎలాంటి వాహనాలు రాకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. ఆటోలో ఉన్న వేగివారిపాలానికి చెందిన అప్పారి జగదీష్, సూరిబాబులు గాయపడ్డారు. గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించారు.

‘ఆత్మ’ కార్యక్రమాలు విస్తృతం చేయాలి



ఆత్రేయపురంలో అయ్యగారి వెంకట్రామయ్యను సత్కరిస్తున్న ఆత్మ సభ్యులు

కొత్తపేట: ఆత్మ సంక్షేమ సంఘం సేవా కార్యక్రమాలు విస్తృతం చేయాలని ఆ సంస్థ ప్రతినిధులు నిర్ణయించారు. చాప్టర్ ఆఫీస్‌లో ఆదివారం రాత్రి రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ వేగేశ్న తమ్మిరాజు అధ్యక్షతన ఆత్మా ఆత్మీయ కలయిక, సర్వసభ్య సమావేశం నిర్వహించారు. పలువురు మాట్లాడుతూ సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని కోరారు. సంఘ ఆర్థిక అభివృద్ధికి, సేవా కార్యక్రమాలకు రూ.లక్ష చొప్పున విరాళాలు ప్రకటించారు. ఇటీవల మృతి చెందిన పలువురు గురువులు, సభ్యుల ఆత్మ శాంతికి రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం రిటైర్డ్ ఉపాధ్యాయుడు అయ్యగారి వెంకట్రామయ్య, రిటైర్డ్ ప్రొఫెసర్ కాశీభైనుల వీరభద్రరావు, కామేశ్వరి తదితరులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆత్మ జాయింట్ సెక్రటరీ సీహెచ్ చినవెంకటరాజు, కోశాధికారి వేగేశ్న సురేఖ, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధి కేసుల గుర్తింపునకు సర్వే

మామిడికుదురు: నగరం, లూటుకుర్రు పీహెచ్‌సీల పరిధిలో కుష్ఠు వ్యాధి కేసులను గుర్తించేందుకు సోమవారం నుంచి సర్వే చేపట్టారు. దీనిలో భాగంగా అనుమానితుల ఇళ్లకు వెళ్లి వారిని సర్వే చేస్తున్నారు. ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎం, హెల్త్ అసిస్టెంట్లు ఈ సర్వేలో పాల్గొంటున్నారు. ఫిబ్రవరి 2వ తేదీ వరకు ఈ సర్వే జరుగుతుందని నగరం పీహెచ్‌సీ వైద్యాధికారి కె.స్వర్ణలత తెలిపారు. చర్మంపై స్పర్శ లేని మచ్చలు, చర్మంపై మెరిసే జిడ్డు చర్మం, శరీరంపై నొప్పిలేని బొడిపెలు తదితర లక్షణాలు కుష్ఠు వ్యాధి కారకాలని ఆమె తెలిపారు. ఆరోగ్య సిబ్బంది ఇళ్లకు వచ్చినప్పుడు వారికి వివరాలు అందించి సర్వేకు సహకరించాలని ఆమె కోరారు.

అంబాజీపేట: కుష్ఠు రోగులకు పీహెచ్‌సీలో మెరుగైన వైద్య సేవలు అందిచడంతో పాటు ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నారని సీహెచ్ఓ బి.అప్పారావు అన్నారు. జాతీయ కుష్ఠు వ్యాధి నిర్మూలనా కార్యక్రమంలో భాగంగా అంబాజీపేట పీహెచ్‌సీ వద్ద నుంచి సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ కుష్ఠు వ్యాధి నిర్మూలనకు సహకరించాలన్నారు. అలాగే గ్రామాల్లో ఉన్న కుష్ఠు వ్యాధి గ్రస్తులను గుర్తించేలా చర్యలు తీసుకున్నామన్నారు. కుష్ఠు వ్యాధి గ్రస్తులకు రోగాలపై అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశాలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. ఇదిలా ఉండగా ర్యాలీ నిర్వహించడంలో వైద్య సిబ్బంది అలసత్వం వహిస్తూ కేవలం ఫొటో ప్రదర్శనకు మాత్రమే బ్యానర్ పీహెచ్‌సీ వద్ద పట్టుకుని ర్యాలీ చేసినట్లు ప్రచారం చేస్తున్నారని పలువురు బహిరంగా విమర్శిస్తున్నారు.

ఆలమూరు: కుష్ఠు వ్యాధి పక్షోత్సవాలను విజయవంతం చేయాలని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీల వైద్యాధికారులు డి.సువర్చలాదేవి, డి.సాయికిషోర్, ఆర్.మల్లికార్జున్ అన్నారు. ఆయా పీహెచ్‌సీల పరిధిలోని సబ్ సెంటర్లలో సోమవారం కుష్ఠు వ్యాధి పక్షోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఎంపీహెచ్ఈఓ కె.జ్యోతికుమార్, హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, పి.ఉమ, ఆర్.బాలామణి, లాబ్ టెక్నీషియన్ పి.రాజారమేష్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదానం



రక్తదానం చేస్తున్న టోల్ ప్లాజా మేనేజర్ కేవీవీఎస్ఎన్‌రెడ్డి

రావులపాలెం: రక్తదానం చేయడంతో ప్రమాదాల సమయంలో గాయపడిన వారి ప్రాణాలను కాపాడవచ్చని ఈతకోట టోల్ ప్లాజా మేనేజర్ కేవీవీఎస్ఎన్ రెడ్డి, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఓలేటి శ్రీనివాస్ అన్నారు. 36వ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా సోమవారం ఈతకోట టోల్ ప్లాజా వద్ద మేనేజర్ కేవీవీఎస్ఎన్ రెడ్డి ఆధ్వర్యంలో ఉచిత రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కాకినాడ రోటరీ బ్లడ్ బ్యాంక్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 50 మంది రక్తదానం చేశారు. ఎంవీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ రహదారి భద్రతపై డ్రైవర్లకు అవగాహన కలిగించారు. గోల్డెన్ అవర్, ప్రమాదంలో గాయపడిన వ్యక్తికి సహాయం చేయడం తదితర అంశాలపై డ్రైవర్లకు అవగాహన కల్పించారు. అనంతరం మేనేజర్ కేవీవీఎస్ఎన్ రెడ్డి, ఎంవీఐ శ్రీనివాస్ రక్తదానం చేశారు.

తిరుమలపై కేంద్రం జోక్యం సిగ్గుచేటు

మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి



కొత్తపేట: తిరుమల ఘటనలపై కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవడం రాష్ట్రంలో టీడీపీ నాయకత్వంలోని కూటమి ప్రభుత్వానికి సిగ్గుచేటని కొత్తపేట నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ఎద్దేవా చేశారు. ఆ మేరకు సోమవారం రాత్రి జగ్గిరెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. చంద్రబాబు కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పవిత్ర పుణ్యక్షేత్రమైన తిరుమల, తిరుపతిలో వరుసగా జరగరాని సంఘటనలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సమర్థవంతమైన వ్యవస్థ ఉన్న తిరుమలలో కూటమి ప్రభుత్వం స్వార్థపూరిత చర్యలకు దిగిందని, దాని పర్యవసానమే ఇటీవల వైకుంఠ ద్వార దర్శనం క్యూలైన్లో తొక్కిసలాటలో ఆరుగురు ప్రాణాలు కోల్పోగా, అనేక మంది గాయపడ్డారన్నారు. తిరుమలేశుని భక్తులు అత్యంత పవిత్రంగా భావించే లడ్డూప్రసాదంలో కల్తీ నెయ్యి వాడారంటూ స్వయంగా సీఎం చంద్రబాబు, టీటీడీ ఈవోనే పెద్ద అబాండం వేశారన్నారు. దీనిపై సుప్రీంకోర్టు స్పందించి సీబీఐ అధికారులతో సిట్ ఏర్పాటు చేసిందని, ఈ ఘటన జరిగినప్పటి నుంచి తిరుమల తిరుపతిలో వరుస సంఘటనలు అధికార కూటమి నేతలు చేసిన తప్పులకు పర్యవసానమేనని ఆరోపించారు. ఇటీవల తిరుపతి క్యూలైన్లో తొక్కిసలాట జరిగి పలువురు మృతి చెందడం సహా పలు జరగరాని ఘటనలు జరుగుతున్నాయని, తాజాగా శనివారం తిరుమలలో కొందరు భక్తులు ఎగ్ పలావ్‌ను కొండపైకే తెచ్చి, అక్కడే తినడం వంటి వరుస అపచారాలతో భక్తులను తీవ్ర ఆందోళనకు గురి చేస్తున్నాయన్నారు. ఈ ఘటనలపై కేంద్ర జోక్యంతో వాస్తవాలు బయటకు వస్తాయనే భయంతో సీఎం చంద్రబాబు అమిత్ షా కాళ్లా వేళ్లా పడి కేంద్రం జోక్యాన్ని రద్దు చేయించుకున్నారని ఎద్దేవా చేశారు. చంద్రబాబు పాలన వైఫల్యాన్ని కూటమే ఒప్పుకుని దానిమీద విచారణకు ఆదేశించిందన్నారు.

పశుసంపదను కాపాడుకోవాలి

కొత్తపేట: రైతులు పాడి పశు సంపదను కాపాడుకోవాలని పశుసంవర్థక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్, స్థానిక పశువైద్యశాల వైద్యాధికారి సీహెచ్ వెంకటనారాయణ సూచించారు. ఈ నెల 20 నుంచి 30 వరకూ గ్రామాల్లో ఉచిత పశు వైద్య శిబిరాల్లో భాగంగా సోమవారం స్థానిక పెదగూళ్లపాలెం గ్రామంలో పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఏడీ వెంకటనారాయణ మాట్లాడుతూ పశు సంరక్షణ, పశువులకు వ్యాపించే వ్యాధులు, వాటి నివారణ, పశు సంపద, పాడి అభివృద్ధి తదితర అంశాల గురించి రైతులకు అవగాహన కల్పించారు. కాలానుగుణంగా (సీజనల్) వచ్చే వ్యాధులపై అప్రమత్తం కావాలని సూచించారు. వాటికి ముందు జాగ్రత్తగా ప్రభుత్వం ఉచితంగా టీకాలు వేయిస్తుందన్నారు. ప్రతి పాడి రైతులు టీకాలు వేయించి పశువులను వ్యాధుల బారి నుంచి కాపాడుకోవాలని సూచించారు. అలాగే లేగదూడలకు, పెద్ద పశువులకు క్రమం తప్పకుండా నట్టల నివారణ మందు వేయాలని, గోమార్లు, పిడుదులు, పేలు వంటి వాటిని పశువుల శరీరంపై ఉండకుండా నిర్మూలించుకోవాలన్నారు. పాడి పశు సంపదను వృద్ధి చేసుకోవడం ద్వారా ఆర్థికాభివృద్ధి సాధించాలని సూచించారు. అనంతరం గర్భకోశ వ్యాధులు కలిగిన పశువులను పరీక్షించి, మందులతో పాటు సుమారు 30 పశువులకు నట్టల నివారణ, పిడుదులు, గోమారు మందులు, లివర్ టానిక్‌లు, వివిధ వ్యాధుల మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లైవ్‌స్టాక్ అసిస్టెంట్ పి.ఉమామహేశ్వరరావు, ఏహెచ్ఏలు బీర రమేష్, ఐ.రాజు, పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో పశు వైద్య శిబిరాలు

ఈ నెల 21న గంటి గ్రామంలో, 22న అవిడి, 23న పలివెల, 24న మందపల్లి, 25న ఖండ్రిగ, 27న బిళ్లకుర్రు, 28న వానపల్లి, 29న వాడపాలెం, 30న మోడేకుర్రు గ్రామా ల్లో ఉచిత పశువైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్టు ఏడీ వెంకటనారాయణ తెలిపారు. ఆయా గ్రామాల్లో పాడి రైతులు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మలికిపురం: మండలంలోని విశ్వేశ్వరాయపురంలో సోమవారం లక్కవరం పశువైద్య శాల అధికారులతో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. సర్పంచ్ చెల్లుబోయిన హెలీనా శిబిరం ప్రారంభించారు. పశు వైద్య పోస్టర్‌ను ఆవిష్కరించారు. గర్భకోశ పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. సహాయ సంచాలకుడు ఎస్.వెంకటేశ్వరరావు, మండల పశు వైద్యాధికారి పి.సూర్యనారాయణరాజు, సురేష్, ముఖేష్, సుబ్బారావు, విజయ్, సంజీవరావు పాల్గొన్నారు.

‘గన్నవరపు’ నియమకంపై అభినందనలు



శ్రీనివాసరావును కలసి అభినందిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

అయినవిల్లి: రాష్ట్ర మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పి.గన్నవరం నియోజకవర్గం పార్టీ సమన్వయకర్త (కో ఆర్డినేటర్)గా నియమితులైన అయినవిల్లి మండల జెడ్పీటీసీ సభ్యుడు గన్నవరపు శ్రీనివాసరావును సోమవారం అంబాజీపేట మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్, అయినవిల్లి మండలంలోని పార్టీ నాయకులు వాసంశెట్టి తాతాజీ ఆధ్వర్యంలో కలసి అభినందనలు తెలిపారు. తొలుత గన్నవరపు శ్రీనివాసరావుకు పూలమాలలు వేసి సత్కరించారు. వీరితో గన్నవరపు శ్రీనివాసరావును కలసిన వారిలో అంబాజీపేట మండల జెడ్పీటీసీ, ఎంపీపీ బూడిద వరలక్ష్మి, దొమ్మేటి వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

అయినవిల్లి: జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా మండల విద్యావనరుల కేంద్రంలో 9,10 తరగతులు చదువుచున్న 11 ఉన్నత పాఠశాలల విద్యార్థులకు మండల స్థాయిలో ఎంఈఓ పెచ్చెట్టి శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ‘ప్రజాస్వామ్యంలో ఓటు విలువ ‘అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు జరిపారు. ఈ పోటీలు మండల విద్యాశాఖాధికారి ప్రారంభించారు. ఈ పోటీల్లో ముక్తేశ్వరం ఉన్నత పాఠశాలకు చెందిన పదం మంజుశ్రీ ప్రథమ స్థానం, కొండుకుదురు ఉన్నత పాఠశాలకు చెందిన వైఎస్ఎల్ తేజస్విని ద్వితీయ స్థానం సాధించారు. వీరు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరికి జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా రిపబ్లిక్ డే నాడు బహుమతి ప్రదానం ఉంటుందన్నారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా జి.సాయి శ్రీనివాస్, డి.రామారావు వ్యవహరించారు.

ఉచితంగా కళ్లజోళ్ల పంపిణీ

ఆలమూరు: పినపళ్లలో ఉమెన్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత కళ్లజోళ్ల పంపిణీ జరిగింది. గ్రామ పంచాయతీ వద్ద గతంలో నిర్వహించిన వైద్యశిబిరంలో 52 మందికి కళ్లజోళ్లు అవసరమవుతాయని ట్రస్ట్ ప్రతినిధులు గుర్తించారు. ఈ మేరకు ట్రస్ట్ చైర్మన్, ఆలమూరు సివిల్ కోర్టు ఏజీపీ బూసి విద్యా ప్రసన్న సోమవారం గ్రామానికి విచ్చేసి రోగులకు కళ్లజోళ్లు పంపిణీ చేశారు. వీటిని సర్పంచ్ సంగిత సుభాష్, వక్కపట్ల లక్ష్మణరావు, పెద్దిరెడ్డి పట్టాభి చేతుల మీదుగా అందించారు.

సంక్షిప్తంగా..

వినియోగదారుల సేవాకేంద్రంలో చోరీ

ఆలమూరు: గ్రామశివారు కొత్తూరు సెంటర్‌లో చోరీ జరిగింది. స్థానిక పెదపళ్ల రోడ్డులోని చైతన్య సప్లయర్స్‌లో బ్యాంకు ఆఫ్ బరోడాకు చెందిన అనుబంధ వినియోగదారుల సేవా కేంద్రం ఉంది. అందులో ఆదివారం అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు షట్టర్ తాళాలు పగలగొట్టి అందులో ఉన్న కొంత నగదుతో పాటు ఖాతాదారుల సమాచారంతో నిండి ఉన్న డెస్క్‌ను దొంగిలించారు. దీంతో యజమాని నామాల సురేష్ స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్సై కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని మృతదేహం



రావులపాలెం: స్థానిక రావులపాడు జాతీయ రహదారి పక్కన కాలువ వంతెన సమీపంలో చెట్ల మధ్య గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం ఉన్నట్టు సమాచారం అందడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు ఎరుపు రంగు చొక్కా, గోధుమ రంగు ఫ్యాంట్ ధరించినట్టు పోలీసులు గుర్తించారు. వయసు 30 నుంచి 35 ఏళ్ల మధ్య ఉంటుందని మృతుని ఆచూకీ తెలిసిన వారు పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని సీఐ తెలిపారు. స్థానిక వీఆర్వో ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి మృతదేహాన్ని కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్టు సీఐ తెలిపారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

రావులపాలెం: వేమన జయంతిని పురస్కరించుకుని స్థానిక రెడ్డి సంఘం ఆధ్వర్యంలో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. సుమారు 1000 మంది వృద్ధులకు సంఘం తరఫున దుప్పట్లు పంచారు.

24న లక్ష చామంతి పూజ

కొత్తపేట: వానపల్లి గ్రామ దేవత పళ్లాలమ్మ అమ్మవారికి ఈ నెల 24 (శుక్రవారం) సామూహిక లక్ష చామంతి పూజ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు దేవస్థానం ఈఓ బొక్కా వీరవెంకటేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల భక్తులు పూజా రుసుము రూ.200 చెల్లించి పూజలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. పూజ అనంతరం అన్నదానం జరుగుతుందన్నారు. భక్తులు పూజలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

హెల్మెట్ ధారణపై అవగాహన

ఆలమూరు: మండలంలోని మడికిలో సోమవారం హెల్మెట్ ధారణపై అవగాహన సదస్సు జరిగింది. ఆలమూరు ఎస్సై ఎం.అశోక్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ ధారణ ఆవశ్యకతను వివరించారు. హెల్మెట్‌ను ధరించకపోవడం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. దేశ అత్యున్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు ప్రతి ఒక్కరూ విధిగా హెల్మెట్ ధరించాలని వాహదారులకు విజ్ఞప్తి చేశారు. రహదారి నిబంధనలు పాటించని వాహనదారులపై భారీ జరిమానాలను విధించనున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.